

జాయింట్ కలెక్టర్‌గా శోభిక



పార్వతీపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్ఎస్ శోభిక నియామకమయ్యారు. ఆమె ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై జేసీగా జిల్లాకు రానున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్టు శనివారం కలెక్టరేట్ అధికార వర్గాలు తెలిపాయి. గతంలో ఇక్కడ జేసీగా పనిచేసిన గోవిందరావుకు బదిలీ జరిగ్గా, ఆయన స్థానంలో అంబేడ్కర్ నియామకమయ్యారు. కానీ ఆయన అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో జేసీగా ఎస్ఎస్ శోభికను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐదేళ్లలో.. 20 శాతమే!



పార్వతీపురం మండలం బాలగొడబలోని జగనన్న కాలనీలో పరిస్థితి ఇదీ..



సీతానగరం మండలం పెదబోగిల గ్రామంలో..

- జగనన్న కాలనీల్లో పూర్తయిన గృహ నిర్మాణాలు 2,257
- లేఅవుట్లలో 11,395 మందికి స్థలాలు మంజూరు
- కట్టించి ఇస్తామన్న హామీని నెరవేర్చని సీఎం జగన్
- చాలని ఆర్థిక సాయం.. అప్పుల ఊబిలో లబ్ధిదారులు
- నత్తనడకన పనులు.. ఎన్నికల కోడ్‌లోపు పూర్తవుతాయా?

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

'దేవుని దయవల్ల అధికారంలోకి వస్తే.. పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం.. అర్హులైన ప్రతిఒక్కరికీ స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇస్తాం..' ఇదీ గత ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ. అయితే ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత మాట మార్చి.. మడం తిప్పారు. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు పంపిణీ చేసిన వైసీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేతులెత్తేసింది. లబ్ధిదారులే ఇళ్లు కట్టుకోవాలని తేల్చిచెప్పడంతో ఎంతోమంది అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఐదేళ్లవుతున్నా నేటికీ లేఅవుట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించక పోవడంతో మరికొందరు నిర్మాణాలకు దూరంగానే ఉండిపోయారు. మొత్తంగా సర్కారు తీరులో జిల్లాలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకనే సాగుతున్నాయి. 'మన్యం'లో 11,395 మందికి ఇళ్లు మంజూరు చేయగా.. ఈ ఐదేళ్ల కాలంలో నిర్మాణాలు పూర్తయిన గృహాలు 2,257 మాత్రమే. మొత్తంగా 20శాతం లోపే పూర్తయ్యాయి. ప్రభుత్వం అందించే సాయం ఏమాత్రం చాలకపోవడం, పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు శివార్లలో స్థలాలు మంజూరు చేయడం తదితర కారణాలతో చాలామంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలపై ఆసక్తి చూపలేదు. మరికొందరు మధ్యలోనే నిర్మాణాలు ఆపేశారు. దీంతో జగనన్న లేఅవుట్లలో పునాదులు, మొండిగోడలతోనే అనేక ఇళ్లు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో పరిస్థితిని ఇప్పుడు తెలుసుకుందాం..

అంతా కేంద్ర ప్రభుత్వమే...

వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత పట్టణ ప్రాంతాల్లో వారికి సెంటు, పల్లెవాసులకు సెంటుప్పావు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయం సున్నా అని చెప్పొచ్చు. గృహ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వమే రూ.లక్షా 50 వేలు అందిస్తుండగా, మరో రూ.30 వేలు ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలాల మంజూరు తప్ప ఇంటి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. అయినప్పటికీ కేంద్రం అందించే రూ.లక్షా 80 వేలు తామే ఇస్తున్నట్లుగా వైసీపీ సర్కారు ప్రజలను మభ్యపెడుతోంది. ఇదంతా తమ గొప్పతనమే అన్నట్లు ప్రచారం చేసుకుంటోంది.

రుణంగా రూ.30 వేలు

పట్టణంలో ఉపాధి హామీ పథకం పనులు ఉండవు కాబట్టి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్షా 50 వేలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారునికి రూ.30 వేలు అందిస్తుంది. ఇది కూడా రుణం రూపంలోనే. అంటే పట్టణ జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు వైసీపీ సర్కారు అందిస్తున్న ఆర్థిక సహాయం రుణమే ఉచితంగా అందించడం లేదు.



గోపాలపురం వద్ద పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణాలు

లేఅవుట్లలో నిర్మాణాలు ఇలా..

జిల్లాలోని 15 మండలాల్లో 403 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇందులో 14,860 ప్లాట్లుగా విభజించారు. సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండతోపాటు మండలాల్లో 11,395 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అయితే ఇందులో కేవలం 2,257 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 1072 మంది లబ్ధిదారులు కనీసం పునాదులు కూడా వేయలేదు. బీబీఎల్ స్టేజ్‌లో 3,419, బీఎల్ స్టేజ్‌లో 3,843, ఆర్ఎల్ స్టేజ్‌లో 548, ఆర్‌సీ స్టేజ్‌లో 216 ఇళ్లు ఉన్నాయి. మొత్తంగా ఐదేళ్లలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారు కేవలం 2,257 మంది మాత్రమేనని చెప్పొచ్చు.

సొంత స్థలాల్లో ఇలా..

జగనన్న గృహాల పేరిట జిల్లాలో సొంత స్థలం కలిగిన 15,901 మందికి ఇళ్లు మంజూరు చేశారు. అయితే వాటిల్లో ఇప్పటికి 10,727 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. 1652 మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించలేదు. బీబీఎల్ స్టేజ్‌లో 952, బీఎల్ స్టేజ్‌లో 1226, ఆర్ఎల్ స్టేజ్‌లో 1009, ఆర్‌సీ స్టేజ్‌లో 342 గృహ నిర్మాణాలు ఉన్నాయి.

ఎందుకింత వ్యత్యాసం...

గృహ నిర్మాణాల విషయంలో జగనన్న లేఅవుట్లతో పోలిస్తే.. సొంత స్థలాలు కలిగిన లబ్ధిదారులు ముందంజలో ఉన్నారు. ఎందుకీ పరిస్థితి నెలకొందంటే.. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. నేటికీ చాలాచోట్ల రహదారులు, కాలువలు నిర్మించలేదు. విద్యుత్, తాగునీటి సౌకర్యం కూడా లేదు. గృహ నిర్మాణ మెటీరియల్ తెచ్చుకోవడానికి కూడా లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ లేవుట్లన్నీ గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు శివారు, కొండలు, గుట్టల్లో నివాస యోగ్యం కాని స్థలాల్లో ఏర్పాటు చేసినవే. మరోవైపు జగనన్న లేఅవుట్లలో స్థలాలు పొందిన వారిలో అత్యధికులు నిరుపేదలే. సొంత సొమ్ముతో పునాదులు కూడా నిర్మించుకోలేని పరిస్థితి. వాస్తవంగా నిరుపేదలకు తామే ఇళ్లు నిర్మించి ఇస్తామని తొలినాళ్లలో ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఎంతోమంది సంబరపడ్డారు. సొంతింటి కల నెరవేరుతుందని భావించి దరఖాస్తులు చేసుకున్నారు. అయితే స్థలాల పంపిణీ తర్వాత ప్రభుత్వం మాట మార్చింది. లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలని సర్కారు చెప్పడంతో పేద, మధ్యతరగతి వర్గాల వారు తీవ్ర నిరాశ చెందారు. ఇళ్ల నిర్మాణంలో కొందరు చేతులెత్తేయగా.. మరికొందరు స్థలం పోతుందేమోనన్న భయం, అధికారుల ఒత్తిడితో అప్పులు చేసి మరీ నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు మధ్యలోనే నిర్మాణాలు ఆపేశారు. పునాదులు, గోడలు, శ్లాబ్ స్థాయి వరకు పనులు చేపట్టి వదిలేశారు. సీఎం జగన్ మాటలు నమ్మి.. నిండా అప్పుల్లో మునిగిపోయామని, ఇక ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేమంటూ పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తమ గోడును విని గూడు నిర్మాణానికి సహకరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

వేగవంతంగానే జరుగుతున్నాయి..

జిల్లాలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగానే జరుగుతున్నాయి. ప్రతి లబ్ధిదారునికి మా శాఖ ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ప్రసాద్‌బాబు, ఇన్‌చార్జి ఈఈ, పార్వతీపురం మన్యం

నేడు పల్స్ పోలియో

- ఏర్పాట్లు పూర్తి
- గిరిశిఖర గ్రామాలకు ప్రత్యేక బృందాలు



పార్వతీపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం టౌన్/ సాలూరు రూరల్: జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పీహెచ్‌సీలు, సీహెచ్ఎస్సీల్లో వ్యాక్సిన్‌ను సిద్ధం చేశారు. జిల్లాలో 980 కేంద్రాల్లో ఐదేళ్లలోపు 98,991 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనుండగా, ఇందుకు సంబంధించి పలు బృందాలను కూడా నియమించారు. 42 సంచార టీంలు, 19 ట్రాన్సిట్ టీంలు సైతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. గిరిశిఖర గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షనున్నారు. దీనిపై శనివారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఇటుక బట్టీలు, మత్స్యకారులు నివసించే ప్రాంతాలను గుర్తించి అక్కడుండే చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలని సూచించారు. హైరిస్క్ ఏరియాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అనంతరం పోలియో కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనిటీ అధికారి ఎం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం పార్వతీపురం ప్రధాన రహదారిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంవో జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. వ్యాక్సిన్ నిల్వలకు సంబంధించి పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ పంపిణీ చేసిన బ్యానర్లు, పోస్టర్లను నిర్దేశించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులతో పాటు సంచార జాతుల కుటుంబాల్లో పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు.



పార్వతీపురం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



ఊహు.. కదల్లేదు

పార్వతీపురం డిపో నుంచి విజయనగరం వెళ్తున్న (ఏపీ11జెడ్ 6650) బస్సు శనివారం సాంకేతిక సమస్యతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్ గేటు ప్రధాన రహదారిపై ఆగిపోయింది. దీంతో ప్రయాణికులంతా ఆందోళన చెందారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా స్థానికుల సాయంతో బస్సును వెనక్కి మళ్లించారు. పలువురు నెట్టినా వాహనం ముందుకు కదల్లేదు. చివరకు అందులోని ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు. కాలం చెల్లిన బస్సుల వల్ల తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీఎం దుర్గను వివరణ కోరగా సాంకేతిక సమస్యతోనే బస్సులు ఆగుతున్నాయని తెలిపారు. అంతే తప్ప కాలం చెల్లినవి కావన్నారు.

- పార్వతీపురం టౌన్

ఈఎస్ఎంఎస్‌పై అవగాహన తప్పనిసరి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచన

పార్వతీపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ రూపొందించిన ఎన్నికల జప్తు నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) యాప్‌పై తనిఖీ బృందాలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తనిఖీ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటా యని, సాంకేతికత కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో జప్తు చేసిన డబ్బు, ఇతర వస్తువులకు సంబంధించి ఈఎస్ఎంఎస్ యాప్ రూపొందించినట్లు చెప్పారు. తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్న డబ్బు, ఇతర వస్తువుల వివరాలను ఈ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. 'ప్రజలు ఎంతవరకు డబ్బులు కలిగి ఉండొచ్చు.. ఎంత మొత్తం సీజ్ చేయొచ్చు' అనే అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, తనిఖీ బృందాల నోడల్ అధికారి, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎం.డి.గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నిధులు మంజూరు చేయండి

సీతానగరం బ్రిడ్జి పనులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని కోరారు. శనివారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సీతానగరం బ్రిడ్జి అత్యవసరమని, ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. జిల్లాలో సర్వే పూర్తయిన ప్రదేశాల్లో రాళ్లు పాతుతున్నామని, ఈప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఆయన చెప్పారు. డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తదితరులున్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై

నిర్లక్ష్యం వద్దు: ఆర్డీవో

గరుగుబిల్లి, మార్చి 2 : సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించరాదని పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత ఆదేశించారు. శనివారం ఉల్లిభద్ర సమీపంలోని ఉద్యాన కళాశాల ప్రాంతంలో రిసెప్షన్, స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ అనంతరం కురుపాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాలకు చెందిన బ్యాలెట్ బాక్సులను కళాశాలలోనే భద్రపర్చనున్నట్టు చెప్పారు. ఓట్ల లెక్కింపు కార్యక్ర మాన్ని కూడా ఇక్కడే చేపడతామన్నారు. అనంతరం వాహనాలు, పార్కింగ్, రహదారులు, తదితర వాటిపై పంచాయతీ రాజ్, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో చర్చించారు. కళాశాలకు ఆనుకుని ఉన్న రహదారి మరమ్మతులు చేయాలని, ఇరుకుగా ఉంటే విస్తరణ చేయాల్సి ఉందని తెలిపారు. పరిశీలనలో పీఆర్ ఈఈ కృష్ణాజీ, ఆర్టీవో మల్లికార్జునరావు, డివిజనల్ సర్వేయరు కె.సూర్యారావు, తహసీల్దార్ కె.జమ తదితరులున్నారు.



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో

కొత్తవారికి లేనట్లేనా?



- పాత వారికే పింఛన్లు
- రెండు నెలలుగా దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- అన్ని అర్హతలున్నా.. మంజూరు చేయని వైనం
- ఎన్నికల కోడ్‌కు సమీపిస్తున్న సమయం
- ఆందోళనలో జిల్లావాసులు

(గరుగుబిల్లి)

దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెబుతున్న సీఎం జగన్ ప్రకటనలకే పరిమిత మవుతున్నారు. ఆచరణలో మాత్రం చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రజలకు నిరాశ తప్పడం లేదు. నూతన పింఛన్ల మంజూరు విషయంలోనూ సర్కారు దరఖాస్తుదారులకు మొండిచేయి చూపింది. ఫిబ్రవరి, మార్చి నెలలకు గాను సామాజిక తనిఖీలు పూర్తయ్యాయి. జిల్లాలోని అన్ని సచివాలయాల నుంచి మండల అభివృద్ధి కార్యాలయాలకు, అక్కడి నుంచి నేరుగా అమరావతిలోని సెర్ప్ కార్యాలయానికి అర్హుల జాబితాలు వెళ్లాయి. అయితే అన్ని అర్హతలున్నా పింఛన్లు మంజూరు కాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పింఛన్లు మంజూరవుతాయో.. లేదోనని మథనపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో ఎంతోమంది నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల ఆదేశాలతో విద్యుత్ బిల్లులు, ఆధార్, ఓటరు కార్డులతో సంబంధిత సచివాలయాల్లో నమోదు చేసుకున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు నిశితంగా పరిశీలించి పింఛన్ల మంజూరుకు నివేదికలు అందించారు. గత మూడు నెలల కిందట 15 మండలాలు, మూడు అర్బన్ మండలాల నుంచి సుమారు 10 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా.. ఇందులో అధికంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు ఉన్నారు. అయితే జనవరిలో కొంతమందికి నూతన పింఛన్లు మంజూరు చేశారు. ఫిబ్రవరి, మార్చిలో మాత్రం మంజూరు చేయలేదు. సామాజిక తనిఖీలు నిర్వహించి నివేదికలు అందిం చినా మంజూరు కాక పోవడంతో దరఖాస్తు దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల సమస్య కారణంగానే మంజూరులో జాప్యం నెలకొందనే వ్యాఖ్యలు సర్వత్రా విని పిస్తున్నాయి. కాగా ఫిబ్రవరి నెలకు సంబంధించి జిల్లాలోని 1,45,952 మంది పింఛన్‌దారుల కోసం సుమారు రూ.43 కోట్లను బ్యాంకుల్లో జమ చేశారు. మొత్తంగా పాతవారికే పింఛన్లు అందించి..నూతన దరఖాస్తుదారుల ఆశలపై ప్రభుత్వం నీరు చల్లింది. ఇప్పటికైనా సర్కారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



జాబితాలను పంపించాం

జిల్లాలో అర్హులైన వారికి పింఛన్ల మంజూరు కోసం సెర్ప్ అధికారులకు జాబితాలు పంపించాం. ఫిబ్రవరి నెలకు సంబంధించి నూతన పింఛన్లు మంజూరు కాలేదు. సచివాలయాల పరిధిలో సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలన చేసి నివేదికలు అందించారు. ఇంతరకు పింఛను పొందిన వారికి పలు కారణాలతో నిలిచినట్లయితే పరిశీలన చేసి అందించే చర్యలు చేపడతాం. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- వై.సత్యంనాయుడు, ఇన్‌చార్జి పీడీ, డీఆర్‌డీఏ, పార్వతీపురం మన్యం

317 మంది గైర్హాజరు

- ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

పార్వతీపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం 32 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 5,893 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 5576 మంది హాజరయ్యారు. 317 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 2,907 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 262 మంది హాజరయ్యారని, 285 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి మంజుల వీణ ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జడ్పీ సీఈవో రాజ్‌కుమార్



గరుగుబిల్లి, మార్చి 2 : వేసవి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం గరుగుబిల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2022-23లో రెండు విడతలుగా రూ. 16 కోట్లు మంజూరు చేశామన్నారు. 2023-24కు సంబంధించి రూ. 24 కోట్లుకు పైగా కేటాయించామని చెప్పారు. ఇప్పటికే 50 శాతం మేర తాగునీటి అవసరాలకు నిధులు వెచ్చించామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని, సక్రమంగా క్రాష్ కార్యక్రమం నిర్వహించాలని ఆయన ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పన టీడీపీతోనే సాధ్యం

● గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులు
● వైసీపీని ఓడించాలని పిలుపు



మాట్లాడుతున్న సంధ్యారాణి



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

మెంటాడ, మార్చి 2: మండలంలో జయతి గ్రామంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.పి.బంజ్ దేవ్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు గురించి వివ రించారు. ఈ సందర్భంగా బంజ్ మాట్లాడుతూ ప్రజలు శుఖంగా, సంతో షంగా ఉండాలంటే సంధ్యారాణిని ఎమ్మెల్యేగా గెలిపించికోవాల్సిన ఆవశ్య కత ఎంతైనా ఉందన్నారు. ● వైసీపీ, బీజేపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ శ్రేణులు చలుమూరి వెంకట రావు, జి.అన్నవరం, జి ముసలి నాయడు, రామచంద్రుడు, ఎస్.నారం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం టీడీపీతోనే సాధ్యమని గజపతినగరం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శని వారం చౌదంతివలస, పోరలి, సరేవలస, భూపాలరాజపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను అన్నివిధాలా మోసం చేశారన్నారు. ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రగల్బాలు పలికారని, నిరుద్యోగుల ఓట్లు దండుకొని గద్దెనెక్కిన తరువాత నోటిఫికేషన్ల ఊసే పట్టించుకోలేదని ఆరోపించారు. అన్నివర్గాల ప్రజలను ఆలోచించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా చౌదంతివలస గ్రామానికి చెందిన పలువురు తాగునీటి, పారిశుధ్యం, రోడ్లు, పెన్షన్ తదితర సమస్యలను శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, టీడీపీ మండలప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ బంగారునాయుడు, నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందాలంటే విజనరీ ఉన్నచంద్ర బాబుతోనే సాధ్యపడుతుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని జిన్నాం, వేమలి, కొత్తవలస, రంగుపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు మొదటి సారి ఓటు రావడంతో భవిష్యత్‌ను గుర్తు చేసుకొని ఓటు వేయాలని సూచించారు. జగన్ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేక పోయారని దీంతో చెడు మార్గాన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీని గెలిపించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ లోగిన కాంతమ్మ, పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● సోదరుడి పెళ్లి కార్డులు ఇవ్వడానికి వెళుతుండగా ప్రమాదం



సత్యనారాయణ (ఫైల్)

సబ్బవరం, మార్చి 2: తన సోదరుడి వివాహ శుభలేఖలు బంధువులకు ఇవ్వడానికి బైక్‌పై బయలుదేరిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదం సబ్బవరం మండలంలోని అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగింది. దీనికి సంబంధించి సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కోమటపల్లి గ్రామానికి చెందిన సంగరాతి సింహాచలం, పద్మ దంపతుల కుమారులు ఈశ్వరరావు, సత్యనారాయణ ఉపాధి నిమిత్తం కొంత కాలం క్రితం గాజువాక సమీపంలోని దువ్వాడ వచ్చారు. అక్కడ ఉంటూ దగ్గర్లోని రెస్టారెంట్‌లో వంట మాస్టర్లుగా అన్నదమ్ములు ఇద్దరూ పని చేస్తున్నారు. అన్న ఈశ్వరరావుకు ఈ నెల 27న వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సత్యనారాయణ అనకాపల్లిలో తన స్నేహితుడికి శుభలేఖ ఇవ్వడానికి వెళ్లి రాత్రి అక్కడే ఉండిపోయాడు. బొబ్బిలిలో శుభలేఖలు ఇవ్వడానికి అతను శనివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. సబ్బవరం మండలం ఇరువాడ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వస్తున్న క్వారీ లారీ అతడిని ఢీకొంది. దీంతో అతను ఎడమ వైపు పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న డంపర్ లారీ అతని పైనుంచి వెళ్లిపోవడంతో శరీరం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హత్యా రాజకీయాలు, అభివృద్ధికి మధ్య యుద్ధం

రాజాం: హంతకులకు రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధం కొనసాగుతుందని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి సంతకవిటి మండలాలకు చెందిన పలు గ్రామాల బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, వార్డు కమిటీ ఇన్‌చార్జిలతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్యారాజకీయాలకు అభివృద్ధి రాజకీయాలకు మధ్య యుద్ధం అన్నారు. వంచన మోసం, కుట్రలు కుతంత్రాలు చేసే పార్టీకి అభివృద్ధి సంక్షేమం చేసే పార్టీలకు మధ్య యుద్ధం అన్నారు. జగన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, కర్నేని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్సు అధికారుల దాడులు

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ విజిలెన్స్ సీఐ కె.కృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 107 కేసులు నమోదు చేసి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి రూ.8 లక్షల 50 వేలు అపరాధ రుసుం విధించినట్టు సీఐ కృష్ణ తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 08922-234579కి సమాచారం అందించాలని తెలిపారు.

తాగునీటి పైపుల కోసం వినతి

శృంగవరపుకోట రూరల్: స్థానిక గొల్లపాకలు ప్రాంతంలో గతనెల 20న కొళాయి పైపులకు గోతులు తీసి గొట్టాలు వేసి వదిలేశారని... కొద్ది రోజుల క్రితం రెండో వైపు గోతులు తీసి వదిలేసి ఇంటింటి కొళాయిలు వేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సచివాలయ సిబ్బంది స్పందించాలని కోరుతూ వారంతా శనివారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా న్యాయవాది రామకృష్ణ మాట్లాడుతూ దీనిపై కాంట్రాక్టర్‌లను సంప్రదించినా స్పందన లేదని.. దీంతో వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. తమ సమస్య పరిష్కరించపోతే న్యాయపరంగా ముందుకు వెళ్తామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

శృంగవరపుకోట రూరల్: తహసీల్దార్‌గా ఎస్.కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీనివాసరావు బదిలీపై గరివిడి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

పల్స్‌పోలియోకు సిద్ధం

జామి: మండలంలో ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సిద్ధమైనట్టు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

కొత్తవలస: వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల పరిధిలో గల 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో 1,710 మంది పిల్లలకు, కొత్తవలస ఈహెచ్‌సీ పరిధిలో 4,388 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు వైద్యాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం చుక్కల మందు వేసుకోకుండా ఉండిపోయిన వారికి ఈ నెల 4, 5 తేదీలలో వేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

నైతిక విలువలపై అవగాహన

రాజాం: పురపాక సంఘ పరిధిలోని పాఠశాలలో శనివారం రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో మోటివేషన్ తరగతులు నిర్వహించినట్టు బూరాడ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆవశ్యకతను తెలియజేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ విజయలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురపాలక ఆశీలు పాట వాయిదా

రాజాం: పురపాలక సంఘం పరిదిలో రోజువారి ఆశీలు వసూలు చేయడానికి కమిషనర్ కార్యాలయంలో శనివారం ఆశీలు పాటు వేశారు. అయితే గుత్తెదారులు ఎవరూ పాల్గొనేందుకు హాజరు కాకపోవడంతో పాటను వాయిదా వేశారు. గత నెలలో మూడు సార్లు ఆశీలు పాటను ప్రకటించినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో పాటను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. నాలుగో సారి వేలం పాటకు గుత్తేదారులు 10 మందికి ముగ్గురు మాత్రమే హాజరయ్యారు వారుకూడా పాటలో పాల్గొకుండా వెళ్లిపోవడంతో చివరకు వాయిదా పడింది. తదుపరి పాటను ఎప్పుడు వేసేది ప్రకటిస్తామని కమిషనర్ నారప్పలనాయుడు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

లక్కవరపుకోట: ఎల్.కోట ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వి.ప్రకాశరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. ఏప్రిల్ 21న రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాల సమయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాలలో సోమవారం హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీరేంద్ర కుమార్ తెలిపారు. 2020 నుంచి 2024 వరకు బీఎస్‌సి, ఎంఎస్‌సీ కెమిస్ట్రీ చేసిన పురుష అభ్యర్థులు బయోడేటాలతో సోమవారం హాజరు కావాలని ఆయన తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..



పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న బేబీనాయన, తెంటు

రాజాం: సీఎంగా కొనసాగేందుకు జగన్ మోహన్ రెడ్డికి అర్హత లేదని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన 35 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగు దేశం పార్టీలో చేరాయి. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి రైతులు, మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీలు మైనార్టీలను దారుణంగా వంచించారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్షుభుక్త కృష్ణమూర్తి, మజ్జి వెంకటనాయుడు, పి.వెంకటరావు, కొరటాన గౌరినాయుడు, దొంతల దుర్గారావు, రాగోలు రమేష్, చిత్తిరి దాలిరాము, శెట్టి మురళి, తుమ్మి రాజా గోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు

గయ్యన్నవలస సర్పంచ్‌తో సహా..

మండలం గయ్యన్నవలస గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ సమతం లక్ష్మీ తో పాటు మరో 100 కుటుంబాలు శనివారం రాత్రి టీడీపీలో చేరాయి. కోండ్రు మురళీమోహన్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశత్వ వైఖరితో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సంక్షేమం నిర్వీర్యం అయ్యాయన్నారు. కార్యక్రమంలో గురవాన నారాయణరావు దుప్పపూడి శ్రీనివాసరావు. పొన్నాడ భీమేశ్వరరావు, రగమండల గణపతినాయుడు, చీడి కుమార్, చీడి జగన్నాథం తదితరులు ఉన్నారు. ● **తెర్లాం:** పూనువలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెడ్డి ముకుందం మాష్టారు, శివాజీ మాష్టారు ఆధ్వర్యంలో సుమారు 40 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుల ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ పార్టీ కండువాలు వేసి బేబీనాయన, తెంటు లక్ష్మంనాయుడు ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సింగిరెడ్డి ఈశ్వరరావు, తేలాపు సత్యం, రెళ్ల రాము, రెళ్ల సూర్యనారాయణ, రెళ్ల పైడితల్లి, తేలాపు సింహాచలం, పందిరి నాగరాజు, శనపతి లక్ష్మణరావు, తేలాపు బాగిరాజు, రెళ్ల మురళి, మామిడి ఆదినారాయణ, మామిడి రాజేష్, కల్లూరి విక్రమ్, పోలాకి యేసు, మామిడి సూర్యనారాయణలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెర్లాం మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, మాజీ జెడ్పీటీ సీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేష్, ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివేకానంద హత్యకేసులో దోషి తేలాలి



మాట్లాడుతున్న కోళ్ల

లక్కవరపుకోట, మార్చి 2: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బాబాయి వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు ముద్దాయి ఎవరనేది తేల్చాలని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి డిమాండ్ చేశారు. శనివారం ఎల్.కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మట్లాడారు. ఢిల్లీ కేంద్రంగా వివేకా కుమార్తె సునీతారెడ్డి తన తండ్రి చావుకు ప్రధాన కారణం జగన్ కుటుంబమేనని మీడియా పూర్వకంగా చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. జగన్, భారతి, అవినాస్‌లతో పాటు మరికొంతమందిపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, లాలం అర్జునరావు, భూపాల్ నాయుడు, రత్నాజీ, శివాజీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సొంత చెల్లికే అన్యాయం చేసిన సీఎం

● టీడీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన

బాడంగి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సొంత చెల్లెలికే న్యాయం చేయని వ్యక్తి అని... రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ న్యాయం చేస్తామనడం విడ్డూరంగా ఉందని టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. శనివారం బాడంగిలో తెంటు నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ జగన్ బాబాయి వివేకానంద రెడ్డిని అప్పట్లో ప్రభుత్వమే హత్య చేసిందని చంద్రబాబుపై ఆరోపణలు చేస్తూ సీబీఐ దర్యాప్తునకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో సీబీఐ విచారణ జరిపించడం లేదు ఎందుకని ప్రశ్నించారు. చెల్లి షర్మిలకు, పినతండ్రి కుమార్తె సునీతకు అన్యా యం చేశారని అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలసి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు తెంటు రవిబాబు, కార్యదర్శి లచ్చుపతుల సత్యం, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు



అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

బొబ్బిలి: కృష్ణాపురం వెళ్లే దారిలో గల చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారు. ఈ గ్రావెల్‌ను సమీపంలో గల కాలనీలో రోడ్ల కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆర్ఐ కళ్యాణ చక్రవర్తి శనివారం మధ్యాహ్నం వీఆర్‌ఓతో కలసి వెళ్లారు. ఆర్ఐ వస్తున్నారని తెలిసి అక్కడి నుంచి గ్రావెల్ తవ్వుతున్న వారు వెళ్లిపోయారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న మాట వాస్తవమేనని... దీనిపై తహసీల్దారుకు నివేదించి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇటీవల జరిగిన రీసర్వే ప్రకారం చెరువు హద్దుల ప్రాప్తికి ఆక్రమణలు తొలగించుకున్నామే తప్ప అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టలేదని జగన్నాథపురం సర్పంచ్ బొద్దల పద్మాసత్యనారాయణ తెలిపారు.

పారాదిలో న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వాసుదేవన్

బొబ్బిలి: పారాది గ్రామంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.వాసుదేవన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో న్యాయపరంగా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. జాతీయ లోక్‌అదాలత్, గిరిజన చట్టాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల విద్యాహక్కు చట్టం, తదితర వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ, న్యాయవాది అల్లాడ నగేశ్ కుమార్, గొర్లె కృష్ణ, గ్రామ పెద్దలు, పంచాయితీ కార్యదర్శి, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదు

● టీడీపీ విజయనగరం అభ్యర్థి అదితి గజపతిరాజు



కొత్తపేట, సాకేటివీధిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదితి

విజయనగరం రూరల్: రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు కావడం లేదని, రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని టీడీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా నగరంలోని 20, 13 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలను వివరించారు. సాకేటివీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిపై కక్ష పెట్టుకుని.... కేసులు పెడుతున్నారన్నారు. ఇదేనా ఈ ప్రభుత్వం రాజ్యాంగానికి ఇస్తున్న గౌరవమని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సమస్యలు అధికమయ్యాయి తప్ప.. పరిష్కారం కాలేదన్నారు. సాకేటివీధిలో ఉన్న చర్చికి వెళ్లి క్రైస్తవుల సమస్యలు తెలుసుకున్నారు. బంగారమ్మపేట కాలనీలో కాయగూరల వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగ చంటి, సుంకరి శ్రీనుబాబు, కల్లూరి లక్ష్మణరావు, చందక స్వప్న యాదవ్, కొయ్యాన సంతోష్, జిగిలి జనార్ధన్, చందక తాతయ్యలు, దువ్వ కృష్ణ, బంటుపల్లి సన్యాసిరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాజాం: పౌష్టిహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చౌదరి సన్యాసమ్మ అన్నారు. శనివారం మల్లికార్జున కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో లాభదాయకం

శృంగవరపుకోట రూరల్: డ్రోన్‌ల సాయంతో పురుగు మందుల పిచికారీ చేయడం రైతులకు అన్నివిధాలా లాభదాయకమని మండల వ్యవసాయాధికారి రవీంద్ర అన్నారు. శనివారం సంతగౌరమ్మపేట, కాపుసోంపురం గ్రామాల్లో పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్‌లతో పురుగు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణ, ఉదయ్, ధనుంజయ్, ఏసులు మాట్లాడుతూ కేవలం పది నిమిషాల్లో ఎకరా పొలానికి డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ చేయవచ్చని చెప్పారు. ఖర్చు తక్కువ అని వివరించారు. వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల హక్కు పత్రాల పంపిణీలో సీఎం భజన

బొబ్బిలి: జగనన్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాల పంపిణీ సభలో సీఎం జగన్‌పై స్తోత్ర పాఠాలు చదివి తమ భక్తిని చాటుకున్నారు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దారు త్రినాథరావు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగితో పాటు పలువురు నాయకులు పొగడ్తల పర్వాన్ని సాగించారు. మానవ జన్మ ఎత్తిన వారికి ఇలాంటి సీఎం దొరకడం అదృష్టమన్నారు. ఒక్క వ్యక్తి సమాజాన్ని ఎలా మార్చేస్తాడోనని అందరం అనుకున్నామని... కానీ చేతల్లో చేసి చూపించాడని అన్నారు.

పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్వరలో జిల్లాకు రానున్న కేంద్ర బల గాలు బస చేసేందుకు కల్పించాల్సిన మౌలిక వసతులను పరిశీలించేందుకు శనివారం ఎస్పీ దీపిక సారిపల్లిలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి గదులు, మంచినీటి సౌకర్యం, వంట గదులు, భోజన శాలను పరిశీలించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ ఆష్మా పర హీన్, ట్రైనీ ఐపీఎస్ జావలి అల్ఫాన్స్, డీఎస్పీలు వీరకుమార్, గోవిందరావు, యూనివర్స్, సీఐలు నర్సింహమూర్తి, రామారావు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న సోము రాంబాబు

దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఆచరణలో కొనసాగకుండా తుంగలో తొక్కుతున్నాయని... దీన్ని కాపాడుకునేందుకు ప్రతి బహుజనుడూ ముందుకు రావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం విజయనగరం అసెంబ్లీ నియోజవర్గ స్థాయి సమావేశం జమ్ము నారాయణపురం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సోము రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు పైడిరాజు, బీఎస్పీ నాయకులు శివప్రసాద్, కేవీ రమణ, జగన్నాథం, అశోక్ అంబేడ్కర్, రాంబాబు, పి.శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 2: మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నట్టు చెప్పి ఫోర్జరీ సంతకంతో ఉత్తర్వులు జారీ చేయించిన ఘటనలో వ్యక్తి అరెస్ట్ అయ్యాడు. దీనికి సంబంధించి శనివారం సీఐ వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా సీఆర్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు నగరానికి చెందిన అంబులెన్స్ శివ పరిచయం అయ్యాడు. విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హేమంత్ కుమార్ అనే వ్యక్తికి విజయనగరం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నమ్మించాడు. ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని చెప్పి శ్రీనివాసరావు వద్ద నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. హేమంత్‌కుమార్‌కు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి లేనప్పటికీ అతని పేరున దరఖాస్తు రాసి, అతని సంతకాన్ని ఫోర్జరీ చేసి శ్రీనివాసరావుకు అప్పగించాడు. దీంతో శ్రీనివాసరావుకు మ్యూచవల్ ట్రాన్స్‌ఫర్ అయినట్లు ఉన్నతాధికారుల నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అవడంతో తాను ఏవిధమైన దరఖాస్తు చేయలేదని హేమంత్ కుమార్ వాపోయాడు. శ్రీనివాసరావుకు బదిలీ కాకపోవటంతో అంబులెన్స్ శివపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అంబులెన్స్ శివ, హేమంత్ కుమార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి శ్రీనివాసరావును మోసం చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో అంబులెన్స్ శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెంకట్రావు తెలిపారు.

భీమసింగి వంతెనపై రోడ్డు ప్రమాదం

● యువకుడికి గాయాలు

జామి, మార్చి 2: మండలంలోని భీమసింగి వంతెనపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ మండలం కొత్తవెలగాడకు చెందిన చంటి బైక్‌పై విజయనగరం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చంటికి గాయాలు కాగా 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జామి పోలీసులు మాట్లాడుతూ ఫిర్యాదు ఇంకా అందాల్సి ఉందని తెలిపారు. ఈ కారు మండలంలోని వైసీపీ నాయకుడిదిగా చెబుతున్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

రామభద్రపురం: మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. స్థానిక చినమ్మతల్లి ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న దాడుల్లో అనధికారికంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 14 మద్యం బాటిళ్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస: ముసిరాం, రామలింగపురం గ్రామాలలో నాటు సారా తయారీ నియంత్రణ కావడం లేదు. రెండు రోజుల కిందట అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు చేసి 2,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రామలింగపురంలో కొత్తవలస సీఐ 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తాజాగా శనివారం మరోసారి రామలింగపురంలో కొత్తవలస సీఐ చంద్రశేఖర్ నిర్వహించిన దాడులలో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

దేవాలయానికి తాళాలు

● పోలీసులకు ఈవో పిర్యాదు

రాజాం: సంతకవిటి మండలం హొంజరాంలో వెలసిన వల్లభ నారాయణ మల్లికార్జున స్వామి దేవాలయ అర్చకుడు బంకుపల్లి పార్వతీమల్లీశ్వర శర్మ ఆలయానికి తాళాలు వేసి..విధులకు గైర్హాజరయ్యాడని ఈవో బీవీ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాళాలు దేవదాయ శాఖ అధికారులకు అప్పగించకుండా వేరే దేవాలయంలో చేరినట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో తాను స్వయంగా వెళ్లి పరిశీలించానని తెలిపారు. ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని... ఈ విషయంపై సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశామని మాధవరావు తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తక్షణమే తాళాలు అప్పగించకపోతే అర్చకుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

లక్కవరపుకోట: గొల్జాం గ్రామంలో కొలువైన షిర్డి సాయిబాబాకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏడో వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులంతా బాబాకు హోమాలు, ప్రత్యేక పూజలు చేసి... అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

శివరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు

వంగర: సంగాంలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం గంగమ్మతల్లి గుడి ముందు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి ముహూర్తపు రాట వేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జాతరకు ఏర్పాట్లు మొదలు పెట్టారు.

'సూపర్ సిక్స్'తో ప్రజా సంక్షేమం

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం



సాలూరు: యువతతో టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి



సీతంపేట: బాబుష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న జయకృష్ణ



గుమ్మలక్ష్మీపురం: టీడీపీలో చేరుతున్న వారికి ఆహ్వానిస్తున్న జగదీశ్వరి

టీడీపీ అధినేత ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శనివారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

టీడీపీని గెలిపించండి: జయకృష్ణ

సీతంపేట: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థిని గెలిపించాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ కోరారు. మండలంలోని సంతమల్లి, దారిమల్లి, మల్లికాలనీ, నాయుడుమల్లి, కుశిమిగూడల్లో శంఖారావం కార్యక్రమంలో భాగంగా బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ గ్రామంలో సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, నాయకులు సీమల కృష్ణారావు, నిమ్మక నాగేశ్వరరావు, పాలక ఆదినారాయణ, కుంబిరక రామారావు, నిమ్మక చంద్రశేఖర్, ఊయక సత్యం, బిడ్డిక స్వామినాయుడు, నిమ్మక మురళి, మూటక అప్పారావు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలి..

కొమరాడ: మండలంలోని చంద్రంపేటలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయవలసిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలకు అందించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ పొట్నూరు వెంకట నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొట్టాపు త్రినాధం, పల్లి రామారావు పాల్గొన్నారు.

ఉపాధి టీడీపీతోనే సాధ్యం: సంధ్యారాణి

సాలూరు: 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగలం నిధి నుంచి నెలకు మూడు వేలు నిరుద్యోగ భృతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ సాలూరు నియోజకవర్గ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మండలంలో కూర్మరాజుపేటలో కులం, డబ్బు కాదు...నాయకుడి సమర్థతను చూసి తొలి ఓటును చంద్రబాబుకు వేద్దాం అన్న కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె యువకులతో మాట్లాడుతూ యువతే దేశానికి బలమని, దేశం, రాష్ట్రాభివృద్ధిలో వారి పాత్ర కీలకమన్నారు.అవినీతిని అంతం చేయాలన్నా, అభివృద్ధికి బాటలు వేయాలన్నా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నా యువతే కీలకమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం యువతను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ఆముదాల పరమేష్, పాచిపెంట మండల నాయకులు పిన్నింటి ప్రసాద్‌బాబు, కనకారావు పాల్గొన్నారు.

విజయానికి సహకరించాలి: జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కురుపాం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.మండలంలోని జర్న పంచాయతీలో బబిడి గ్రామం, జర్న గ్రామ పంచాయతీలో కిల్లక భాస్కరరావు ఆధ్వర్యంలో 150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు పాడి సుదర్శనరావు, పోలూరు శ్రీనివాసరావు, కీలక దాసు, అనిల్, కోటి, సోమేశ్వరరావు, దర్మ పాల్గొన్నారు.



కొమరాడ: సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న నాయకులు

బస్సులు ఏర్పాటు చేయండి: ఈవో

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలంలోని గుంప సోమేశ్వరాలయంలో ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో జరిగే శివరాత్రి మహోత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం బస్సులను ఏర్పాటు చేయాలని, పట్టణ గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదు కోరారు.ఈ మేరకు పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గుంప సోమేశ్వరాలయానికి ఆర్‌అండ్‌బీ అధికారులు నూతనంగా రహదారి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. ఆర్టీసీ బస్సుల ద్వారా సులభంగా ఆలయానికి చేరు కునేందుకు అవకాశముందని చెప్పారు. శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశామని తెలిపారు. డిపో మేనేజర్ దుర్గా మాట్లాడుతూ శివరాత్రి మహోత్సవాలకు బస్సులు నడపేందుకు ఉన్నతాధికా రులతో మాట్లాడి చర్యలు చేపడతామని చెప్పారు.

కేజీబీవీని సందర్శించిన ఐబీ బృందం

సీతానగరం: మండలం జోగింపేట కేజీబీవీ స్కూల్‌ను శనివారం ఇంటర్నేషనల్ బాకలోరియెట్(ఐబీ) బృందం సందర్శించింది. ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ కేశిరాజు శ్రీనివాస్, ఐబీ సీనియర్ కరిక్యులర్ డిజైన్ మేనేజర్ మిష్టర్ ఆల్బో, ఐబీ అసోసియేట్ మేనేజర్, అసెస్మెంట్ ఆపరేషన్స్ మైఖేల్ పాఠశాలలో బోధనాభ్యాస విధానాన్ని పరిశీలించారు.ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, విద్యార్థినులతో బోధనావిధానాల గురించిచర్చించారు.ఐబీ బృందంతో జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ విద్యా ప్రణాళిక, బోధనాభ్యాస విధానాలు, ఉపాధ్యాయ శిక్షణలు తదితర అంశాలపై మాట్లాడారు. వారు ఏఎంవో బి.శ్రీనివాసరావు, ఏఎస్‌వో బి.రామకృష్ణ, విద్యా సంబంధ విషయాలపై చర్చించారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సూరిదేవుడు, పాఠశాల ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పాచిపెంట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను రానున్న ఎన్నికలు దృష్ట్యా ఏఎస్పీ ఆధ్వర్యంలో శనివారం తనిఖీనిర్వహించామని ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. ఆయాపోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న రహదారుల మధ్యలోగల కల్వర్టులు,బ్రిడ్జిల కింద పరిశీలించినట్లు చెప్పారు. మందు పాతరల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా తనిఖీలు చేశామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం మరింత పెరగాలి: పీడీ

గరుగుబిల్లి: ప్రకృతివ్యవసాయం సాగు విస్తీర్ణం మరింత పెరగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు తెలిపారు. శనివారం గరుగుబిల్లి వైఎస్‌ఆర్‌క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలోసీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం డీపీఎం పి.షణ్ముఖరాజు, జీవనోపాధుల డీపీఎం ప్రవీణ్, మండల వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, సీహెచ్ ప్రసాద్, కె.కృష్ణ, బి.రామినాయుడు, వి.లక్ష్మణరావు, ఎస్‌ఎఫ్‌ఏ జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

నందివానివలసలో ప్రకృతి పంటల పరిశీలన

ప్రకృతివ్యవసాయ విధానాలతోనే అధికఆదాయం పొందవచ్చునని రీజినల్ మేనేజర్ ప్రకాష్ తెలిపారు. తోటపల్లి పంచాయతీ నందివానివలసలో సాగు చేస్తున్న ప్రకృతి విధాన పంటలు పరిశీలించారు. కార్య క్రమంలతో జిల్లా ప్రకృతి వ్యవసాయమేనేజర్ పి.షణ్ముఖరాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

పాచిపెంట:మండలంలోని రాయిగుడ్డివలసనుంచి భీమన్నదొరవలస వరకు, తాడూరురోడ్డు జంక్షన్ నుంచి కొండతాడూరు వరకు బీటీ రోడ్డుకు నిర్మాణానికి డిప్యూటీసీఎం పి.రాజన్నదొర శనివారం భూమి పూజ చేశారు. అలాగే సీతంపేట నుంచి పాచిపెంట రోడ్డు జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణానికి, పి.కోనవలస గిరిజన సంక్షేమ పాఠశాలలో డైనింగ్‌హాల్, కిచెన్‌గది నిర్మాణానికి శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

భామిని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 274 మంది విద్యార్థులకు 12 మంది గైర్హాజరయ్యారు. తెలుగులో 234 మంది, ఒడియాలో 28 మంది పరీక్షలు రాసినట్టు ఎగ్జామ్ చీఫ్ ఎర్రంనాయుడు పేర్కొన్నారు.

'ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు'

పాలకొండ:ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీజోన్-1 డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనా యుడు సూచించారు.శనివారం పాలకొండ డిపోను సందర్శించి పరిశీలించా రు.ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. డ్రైవర్లు, కండక్టర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు.ఇంధనం ఆదాచేసి ఆర్టీసీకి లాభాలు తీసుకురా వాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ వెంకటేష్, రఘు, అసిస్టెంట్ ఇంజినీర్ పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన కల్పించాలి

సీతంపేట: రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటింగ్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి రాజశేఖర్ స్పష్టం చేశారు. శనివారం సీతంపేట ఐటీడీఏ ఎస్‌ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో పాలకొండ నియోజకవర్గంలోని బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు బీఎల్వోలు తెలుసుకోవాలన్నారు. ఎన్నికలకు అందరూ సమాయత్తం కావాలన్నారు.కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

కూనేరులో వైద్య శిబిరం

కొమరాడ:గిరిజనులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలన్న ఉద్దేశంతో మెగా వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం కూనేరు వారపుసంతలో పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరంలో 500కుపైగా గిరిజనులకు వైద్య పరీక్షలుచేసినట్టు చెప్పారు. గిరిజనులకు గొడుగులు, వస్త్రాలు, యువతకు వాలీబాల్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్ రోషన్, సీఐ కె.రవికుమార్, ఎస్‌ఐలు కె.నీలకంఠం, దినకర్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల పత్రాల పంపిణీ

వీరఘట్టం:స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం వ్యవసాయ భూమి మంజూరు, ఇంటి స్థల హక్కు పత్రాలను ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి లబ్ధిదారులకు అందించారు. బిటివాడ, ఎం.వెంక టాపురం గ్రామాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు 19.5 ఎకరాల భూమిని అందించినట్టు తెలిపారు. 509 మంది లబ్ధిదారులకు నవరత్నాలలో భాగంగా ఇంటి స్థల హక్కు పత్రాలు అందించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

వీరఘట్టం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. విద్యుత్ సమస్యలపై తీవ్ర స్థాయిలో చర్చ సాగింది. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు విద్యుత్ సమస్యలపై ధ్వజ మెత్తారు. స్తంభాలు మార్పు చేయడం లేదని, పాడైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ జయ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఒడిశా

రాయగడ: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని బిజూ జనతాదళ్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరావు (కొండబాబు)తెలిపారు. కొంధోమల్లిగ్రాం గ్రామంలో ఎస్టీ యువజనం సంఘం సభ్యులు జాతీయ స్థాయి వాలీబాల్ టోర్న మెంట్ నిర్వహించనున్నారు.ఈ మేరకు శనివారం భూమిపూజ నిర్వహించారు.

సంస్కృతాంధ్ర భాషలకు మణిహారం అవధానం

రాయగడ: అష్టావధాన, శతావధాన ప్రక్రియలు సంస్కృతాంధ్ర భాషలకు మణిహారమని శ్రీకాకుళం జిల్లాలోని ఉర్లాంకు చెందిన బంకుపల్లి రమేష్‌శర్మ తెలిపారు. స్థానిక రామలింగేశ్వరాలయ కల్యాణ మండపంలో ఉత్కళ బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాసశర్మ అధ్యక్షతన శుక్రవారం రాత్రి సభా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి మూడు రోజులపాటు 108 మంది పృచ్ఛకులతో సంస్కృతాంధ్ర భాషల్లో జరపనున్న శతావధానాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆహారోత్పత్తుల యూనిట్లకు శంకుస్థాపన

రాయగడ: రాష్ట్రంలో 33 భారీ,మధ్యతరహా ఆహారోత్పత్తుల యూనిట్లకు ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ శనివారం వర్చువల్ ద్వారాశంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రాయగడ జిల్లాలో జేకే పరిశ్రమ వద్ద రూ 61 కోట్లతో మొక్కజొన్నప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పనున్నారు. ఈప్లాంట్ నిర్మాణంతో ఈ ప్రాంత మొక్కజొన్న రైతులకు మంచి లాభాలు చేకూరతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఒశ్వాన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మనోజ్ సత్యబాన్ మహాజన్, జేకే పరిశ్రమ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు బినయ్ కుమార్ ద్వివేది, జిల్లా పారిశ్రామికి కేంద్రాభివృద్ధి అధికారి సబ్యసాచి సాహు, జిల్లా ప్రజాసంబంధాల అధికారి బసంతకుమార్ ప్రధాన్, లక్ష్మీకాంత్ జెనా, సునీల్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఎంపీడీవో అక్రమాలపై దర్యాప్తు నిర్వహించాలి

● అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సత్యనారాయణ

గరుగుబిల్లి: గరుగుబిల్లి ఎంపీడీవోగా గతంలో విధులు నిర్వహించిన జి.పైడితల్లి అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించాలని నాగూరు ప్రాదేశిక సభ్యుడు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ వార్షిక తనిఖీలకు వచ్చిన ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్ ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలపరిషత్‌కు సంబంధించి సాధారణ నిధులతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి పలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కాగా పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి అక్రమాలు చేసినట్లు రుజువైతే చర్యలు తప్పవని సీఈవో తెలిపారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు

మండలపరిషత్ కార్యాలయం రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం గరుగుబిల్లి మండలపరిషత్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండల పరిషత్‌కు విడుదలైన నిధులు, ఖర్చులు, తదితర వివరాలను, రికార్డులను జడ్పీ కార్యాలయ ఏవో కె.తులసీనాథ్, పీఎం రవికుమార్, సీనియర్ సహాయకులు బి.శ్రీధర్,జూనియర్‌సహాయకుల పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల్లోని లోపాలను గుర్తించి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవోగా గతంలో విధులు నిర్వహించిన జి.పైడితల్లి హయాంలో పలు లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. పరిశీలనలో ఏవో ఎన్.అర్జునరావు, సిబ్బంది డి.రవిరామ్‌ప్రసాద్, కులశేఖర్, ఈవోపీఆర్‌డీ గోపాలరావు ఉన్నారు.



సీఈవో రాజ్‌కుమార్‌కు ఎంపీడీవోపై ఫిర్యాదు చేస్తున్న సత్యనారాయణ

సెలవులో ఎంపీడీవో

మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి నిధులు తనిఖీకి జడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ శనివారంవచ్చారు. అయితే ప్రస్తుతం ఎంపీడీవోగా ఉన్న పి.సూర్యనారాయణ శనివారం సెలవు పెట్టడంతో కార్యాలయ ఏవో ఎన్.అర్జునరావుకు ఒక రోజు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జి.పైడితల్లిని ప్రస్తుతం ఎన్నికల నియామవళి కారణంగా మొదటిగా పాలకొండ, తదుపరి సంతకవిటి మండలానికి బదిలీచేశారు.అయితే శనివారం సీఈవో వార్షిక తనిఖీకి వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పైడితల్లి గరుగుబిల్లి ఎంపీడీవో కార్యాలయానికి రావడం విశేషం.

ఇప్పుడు సమస్యలు గుర్తొచ్చాయా ?

● ఎమ్మెల్యేను ప్రశ్నించిన గరుగుబిల్లి టీడీపీ మండల ప్రతినిధులు

గరుగుబిల్లి:సమస్యలు కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి ఇప్పుడు గుర్తుకొచ్చాయా అని టీడీపీ మండల ప్రతినిధులు ప్రశ్నించారు. శనివారం ఉల్లిభద్ర సముదాయంలో టీడీపీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, రాష్ట్ర ప్రతినిధి మరడాన తవిటినాయుడు, అంబటి తవిటినాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్, ఎం.నారాయణస్వామి విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా కురుపాం ఎమ్మెల్యేగా ఉన్నారని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎమ్మెల్యేకు సమస్యలు గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. ఎన్నికల డ్రామాలో భాగంగా పలు శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు.2018లో నాబార్డు, ప్రపంచ బ్యాంకు నిధులతో మండలానికి సంబంధించి ఏడు లింకు రహదారులకు తెలుగుదేశం హయాంలో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. సుంకి, పిట్టలమెట్ట, చిలకాం, కారివలస, మరుపెంట, సాంబ న్నవలస, సన్యాసిరాజుపేట, గరుగుబిల్లి నుంచి బీవీపురం, పెద్దూరు రహదారులకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే కేవలం పిట్టలమెట్ట రహదారికి శంకుస్థాపన చేయడంలో ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఐదునెలల్లో పలు రమదారులకు కొబ్బరికాయలు కొట్టారని, వీటిలో ఎన్ని రహదారులు పూర్తి చేశారన్న దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికి రోజుకొక డ్రామాను సృష్టిస్తున్నారని ఆరోపించారు. కొబ్బరికాయలు కొట్టడమే తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో సుమారు ఎనిమిది వేల ఎకరాలకు, పది గ్రామాలకు సంబంధించి సాగు, తాగునీరు అందించేందుకు పలు అనుమతులతో జీవో-164ను అప్పటి టీడీపీ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అధికార వైసీపీకి కాలం చెల్లిందని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపు ఖాయమన్నారు.



మాట్లాడుతున్న మధుసూదనరావు

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు సీతారాం

పార్వతీపురం- ఆంధ్రజ్యోతి: ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని టీడీపీ సీనియర్ నాయకుడు సీతారాం పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురం టీడీపీ కార్యాలయంలో మండలంలోని బూత్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో మమేకమై పార్టీ గెలుపునకు పూర్తిస్థాయిలో కృషిచేయాలని, బోనెల విజయచంద్రను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌టీం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఆదివాసీలకు అన్యాయం

● గిరిజన జేఏసీ నాయకులు బిడ్డిక ఉమామహేశ్వరరావు

సీతంపేట:ఆదివాసీలకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని గిరిజన జేఏసీ నాయకులు బిడ్డిక ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షుడు కూన రవికుమార్ దృష్టికి ఆదివాసీ సమస్యలు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా శనివారం సీతంపేటలో ఉమా మహేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదివాసీ సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఆదివాసీ ఉనికికి కాపాడాలని తెలియజేశామని చెప్పారు.



రవికుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ఉమామహేశ్వరరావు

తుడిలో ఆర్బీకే ప్రారంభం

వీరఘట్టం: తుడి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్సీ విక్రాంత్,ఎమ్మెల్యేకళావతి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కన్నతల్లి, ఎంపీపీ వెంకటరమణనాయుడు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుల వసూళ్ల విషయంలో మరోసారి అవకాశం ఇచ్చిందని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని నగరపాలక, పురపాలకసంఘాల్లో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, పన్నుపై విధించిన వడ్డీ మాఫీ చేసినట్టు వివరించారు.బకాయి ఉన్న మొత్తాన్ని 31లోగా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందన్నారు.

అభిలాష గ్రంథాలయం పరిశీలన

పార్వతీపురం రూరల్: మండలంలోని లక్ష్మీనారాయణ గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటుచేసిన అభిలాష గ్రంథాలయాన్ని శనివారం కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ పరీక్షలకు వెళ్లే యువత కోసం ప్రారంభించిన అభిలాష గ్రంథాలయాలు వారికి భరోసాగా ఉంటాయని తెలిపారు. ఈనెల ఏడో తేదీ నుంచి మరికొన్ని ప్రాంతాల్లో అభిలాష గ్రంథాలయాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ప్రత్యేకాధికారి రామచంద్రరావు, ఎంపీడీవో షేక్ మహ్మద్, ఆకీబ్‌జావిద్, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పొట్లిలో బెజ్జిపురం సంబరాలు

పాలకొండ: మండలంలోని పొట్లిలో బెజ్జిపురం సంబరాల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. శని, ఆదివారాల్లో శ్రీరామునివారి సంబరాల మహోత్సవాలు జరపడానికి గ్రామపెద్దలు నిశ్చయించారు. శనివారం సాయంత్రం తప్పెటగుళ్లు, దేవునికి తిరువీధి నిర్వహించారు. ఆదివారం పందిరిపాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి: రావివలస పీహెచ్‌సీ పరిధిలోని ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి చేశామని వైద్యాధికారి కె.కార్తీక్ వెల్లడించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ 2042 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 15 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

● **భామిని:** మండలంలోని 45 కేం ద్రాల్లో 3,247 మంది చిన్నారులను పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వైద్యాధికారులు దామోదర్, దీపిక, సోలో తెలిపారు. శనివారం భామిని, బాలేరు, బత్తిలి పీహెచ్‌సీల పరిధిలో ప్రచారాలు చేపట్టారు.

●**వీరఘట్టం:** వీరఘట్టం పీహెచ్‌సీ పరిధిలో 3,800 మంది, బిటివాడ పీహెచ్‌సీపరిధిలో 2,960 పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యులు పాలవలస ఉమామహేశ్వరి, మానస తెలిపారు. ఈ మేరకు మండలంలో 45 కేంద్రాల్లో ఆదివారం పల్స్‌పోలియో చుక్కల కార్య క్రమం నిర్వహిస్తామన్నారు.

●**పాలకొండ:** ఓనిలో పల్స్‌పోలియో ప్రచార ర్యాలీని నిర్వహించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని బలగ నాగమణి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారదా కుమారి, గోగుల సూర్యనారాయణ, సిద్దాబత్తుల వెంకటరమణ, కుదమ తిరుమలరావు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఆరిక సుశీల, కిల్లారి అనూష్, ఆశ కార్యకర్తలు షైమావతి, నీలవేణి, హరిత పాల్గొన్నారు.



భామిని: బాలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాచిపెంట:సాలూరు నుంచి పాచిపెంట విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగించనుండడంతో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఎలక్ట్రికల్ ఏఈ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరిస్తారని ఏఈ కోరారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తులు

పార్వతీపురం-ఆంధ్రజ్యోతి: అగ్నిపథ్ పథకం కింద 2024-25 రిక్రూట్‌మెంట్ సంవత్సరానికి అగ్నివీర్‌లో ఎంపికలకు పెళ్లికాని పురుష అభ్యరుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ విశాఖపట్నం వారు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం జిల్లాకు చెందిన దరఖాస్తుదారులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్, పదో తరగతి ఉత్తీర్ణత, అగ్నివీర్ ట్రేడ్‌మ్యాన్ 8వ తరగతి ఉత్తీర్ణత కేటగిరీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఈమేరకు మార్చి 22 వరకు ఆన్‌లైన్‌లోడబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. జేవోఐఎన్ఐఎన్ డిఐఎఎన్‌ఏఆర్‌మైవై.ఎన్ఐసి.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి..

కురుపాం: కురుపాం ఏపీ ఆదర్శపాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి కోరారు. శనివారం కురుపాంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో ఆరో తరగతి 100 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఆదివారం నుంచి ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.ఏప్రిల్ 21న తమ పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందిని చెప్పారు.

● **మక్కువ:** ములక్కాయ వలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఈనెల 2 నుంచి 31 వరకు ఆన్‌లైన్ రుసుము చెల్లించాలని పేర్కొన్నారు.

పోలమాంబ హుండీల లెక్కింపు

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి హుండీలను శనివారం లెక్కించారు. అమ్మవారి నాలుగు వారాల జాతరకు సంబంధించి 32 రోజులకు గాను రూ.16,90,459ల ఆదాయం లభించినట్లు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. బంగారం 14, వెండి 190 గ్రాములు వచ్చాయని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా దేవదాయశాఖఅధికారి ప్రసాదరావుపర్యవేక్షణలో జరిగిన కార్యక్ర మంలో ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, నరసింగరావు, కురుపాం నుంచి శ్రీవారి సేవకులు, జగ్గునాయుడు పేట నుంచి సాయి సేవకులు పాల్గొన్నారు.